క్లుప్తంగా

మహాలక్ష్మి పథకం ఆర్టీసీకి లక్ష్మీ కటాక్షం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆడపడుచుల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఆర్టీసీకి లక్ష్మీ కటాక్షంగా మారిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలో ఆయన ఆర్టీసీ బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం ద్వారా డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు రెండు కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారన్నారు. ప్రజా రవాణా వ్యవస్థకు రేవంత్ ప్రభుత్వం రూ.6,680 కోట్లను చెల్లించిందన్నారు. మహిళా సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ అని స్పష్టం చేశారు.

అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనుండడం సంతోషించదగిన విషయమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉచిత విద్యుత్, రూ.500 వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని కొనియాడారు. అర్హులైన వారు సంక్షేమ పథకాలతో లబ్ధిపొందాలని కోరారు.

బీజేపీ మీర్‌పేట ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: బీజేపీ మీర్‌పేట ప్రధాన కార్యదర్శిగా గాయత్రినగర్‌కు చెందిన జిల్లా మజ్దూర్ మోర్చా మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ చేతుల మీదుగా గురువారం నియామకపత్రం అందుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. తన పదవి కోసం కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కొలన్ శంకర్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, ముఖేశ్ ముదిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం

పహాడీషరీఫ్: బీజేపీ బడంగ్‌పేట్ మున్సిపల్ ఉపాధ్యక్షుడిగా మామిడిపల్లికి చెందిన గుజ్జుల పద్మారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం పద్మారావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీజేపీ రోజురోజుకు బలోపేతమవుతోందన్నారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు రాజ్‌భూపాల్‌గౌడ్‌తో పాటు మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, పెరమోని నరేష్ యాదవ్, కోట్ల రంగనాథ్, గుర్జని గణేష్‌గౌడ్, మహ్మద్ నయీంలకు ధన్యవాదాలు తెలియజేశారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జెన్నాయిగూడ శ్రీ ఛత్రగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం ఘనంగా అమావాస్య వేడుకలు నిర్వహించారు. ఆషాఢ మాసం చివరి రోజు కావడంతో స్వామివారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అనంతరం ఆలయ మాఢ వీధుల్లో స్వామి పల్లకీసేవ చేసి ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి పల్లకీసేవ చేస్తున్న భక్తులు

కంపు.. కంపు

స్టేడియంలో పారిశుద్ధ్య లోపం

- కళతప్పిన క్రీడా ప్రాంగణం
- ఆధునీకరించినా.. సౌకర్యాలు నిల్
- కనీస తాగునీటి వసతి కరువు
- ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

హుడాకాంప్లెక్స్: క్రీడాకారులతో కిటకిటలాడే సరూర్‌నగర్ క్రీడా ప్రాంగణం కళతప్పింది. అస్తవ్యస్తమైన డ్రైనేజీతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దినచర్యగా వ్యాయామం కోసం వచ్చే వారు కంపు భరించలేక వెళ్లిపోతున్నారు. మైదానంలోనే కాదు.. నిర్వహణ లోపంతో స్టేడియంలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నాయి.

సౌకర్యాలు మరిచారు

సరూర్‌నగర్ ఇండోర్/అవుట్‌డోర్ స్టేడియంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అనేక మంది క్రీడాకారులు వివిధ అంశాల్లో శిక్షణ పొందుతుంటారు. వీరితో పాటు స్థానిక వాకర్స్ కూడా వస్తుంటారు. శిక్షణ సమయంలో ఎవరైనా మల, మూత్ర విసర్జనకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. నిర్వహణ లోపంతో మరుగుదొడ్లు మురికి కూపంగా మారి, దుర్వాసన వెదజల్లుతున్నాయి. కనీసం తాగునీటి సౌకర్యం లేదు. ఇటీవలే స్టేడియాన్ని రూ.2 కోట్లతో ఆధునీకరించారు. అయితే మౌలిక సౌకర్యాల కల్పనను మరిచిపోయారు. ఉన్న వాటిని కూడా విస్మరించారు.



ప్రాంగణంలో డ్రైనేజీ

అత్యవసరానికి ఇంటికి

ప్రతిరోజూ ఉదయం పిల్లలను తీసుకుని మైదానికి వస్తుంటాను. ఆరుబయట డ్రైనేజీలు పారుతుండగా.. ఇండోర్‌లోని టాయిలెట్లు నిర్వహణ లోపంతో మురికి కూపంలా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి.

– జి.చంద్రశేఖర్, వాకర్

రాజకీయాల వేదిక

పిల్లలకు ఆటలు నేర్పించాల్సిన చోట రాజకీయ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో స్టేడియం చుట్టూ ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేస్తారు. నాలుగు రోజులు క్రీడా ప్రాంగణానికి సెలవు ప్రకటిస్తుంటారు. పారిశుద్ధ్య లోపంతో స్టేడియం అపరిశుభ్రంగా మారింది.

– కృష్ణమూర్తి, వాకర్

మహేశ్వరం గడ్డపై కాషాయం జెండా

- అత్యధిక స్థానాల్లో విజయం సాధిద్దాం
- ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ఎమ్మెల్యే సబితారెడ్డి
- బీజేపీ జిల్లా కన్వీనర్ శ్రీరాములు యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపై కాషాయ జెండాను ఎగురవేస్తామని స్థానిక సంస్థల బీజేపీ జిల్లా కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధి అమీర్‌పేట్ గ్రామంలోని బస్వ జంగయ్య గౌడ్ పంక్షన్‌హాలులో పార్టీ మండల అధ్యక్షుడు యాదిష్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్యేగా సబితారెడ్డిని గెలిపిస్తే.. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మహేశ్వరం మండలంలో 30 గ్రామాల్లో పార్టీ బలంగా ఉందని, ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో మండలంలో బీజేపీకి ఆధిక్యం వచ్చిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్ల వారీగా సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, స్థానిక సంస్థల ఎన్నికల మండల ఇన్‌చార్జి ప్రతాప్, కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మండల ఎన్నికల కన్వీనర్ అనంతయ్య గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగయ్య యాదవ్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన్ నాయక్, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మనోహర్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్, బీజేవైఎం చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి పి.సుదర్శన్ యాదవ్, జిల్లా నాయకులు ముత్యం, నందీశ్వర్, యాదయ్య, పంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య హోమం



భక్తులకు ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి



కొనసాగుతున్న హోమం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకొని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేకంగా హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తుల సమస్యలకు పరిష్కార మార్గాలను గురూజీ సూచించారు. అనంతరం భక్తులకు ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలను అధిగమించాలంటే నిత్యం కొంత సేపు భగవంతుడి సేవకు కేటాయించాలన్నారు. సాధనతోనే భగవంతుడి కృపకు త్వరగా పాత్రులు కాగలరన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.43, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.65, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.23, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.40, దొండ రూ.20, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.15, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.26, మునగ రూ.28, కందగడ్డ రూ.50, బీట్‌రూట్ రూ.28, కీర రూ.35, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.65. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక

మలక్‌పేట: గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ యూనిట్ నూతన అధ్యక్షుడిగా మూసారంబాగ్‌కు చెందిన పున్‌రెడ్డి కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. మలక్‌పేట సలీంనగర్‌లోని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా కృష్ణహరి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, ఉపాధ్యక్షులుగా కే.మోహన్, కృష్ణ, లలిత, సరోజమ్మ, సుభాష్‌గౌడ్, యాదగిరి, సరోజిని, రామాచారి, చంద్రశేఖర్, దయానంద్, సుదర్శన్, నరసింహ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ చోళా ఓం ప్రకాశ్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

శివారు కాలనీల్లో వీధి దీపాలు

ఎల్బీనగర్: అంధకారంలో ఉన్న కాలనీల్లో కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాల నుంచి శివారు కాలనీలకు వీధి దీపాలు లేకపోవడంతో అంధకారంగా ఉండేవి. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో గత కొన్ని నెలలుగా శివారు కాలనీలు అంధరారంలోనే ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు శివారు కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు లేని కాలనీల్లో త్వరలో ఏర్పాటు చేస్తామని ఏఈ ప్రసాద్ పేర్కొన్నారు.

ఉత్తమ సిబ్బందికి అవార్డులు

నాగోలు: ఆర్టీసీ డిపోలో ఉద్యోగులందరూ నిబద్ధతతో పనిచేస్తూ డిపోను లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయడం అభినందనీయమని బండ్లగూడ డిపో మేనేజర్ వెంకటేశం అన్నారు. జూన్ నెలకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి డిపో ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు అందజేశారు. డిపోలో అత్యాధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు, అధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు గ్యారేజ్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శాలిని, మెకానికల్ ఇంజినీర్ బాల యోగేశ్వరి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు బ్యాగుల పంపిణీ

మన్సూరాబాద్: జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: మున్సిపాలిటీని ఆనుకొని ఉన్న శ్రీమారుతీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేణు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీవాసులు ఆయనతో కలిసి కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీమారుతీనగర్ రోడ్ నంబర్ 1, 2లో డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉందని తెలిపారు. డ్రైనేజీ కాల్వల పనులు పూర్తి చేయించాలని కోరారు. కాలనీలో విద్యుత్ లైట్లు లేక చీకట్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. చిన్నారులు, విశ్రాంతులు చీకట్లో నడవలేకపోతున్నారన్నారు. ఖాళీ ప్లాట్లల్లో పిచ్చిమొక్కలు పెరిగి పాములు నివాసం ఉంటున్నాయని బయటకు వెళ్లాలంటే కాలనీవాసులు బయపడుతున్నారన్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని వీధికుక్కలను పట్టుకుపోవాలని విన్నవించారు. అదేవిధంగా సీసీ రోడ్లు లేక గతుకుల, అంతర్గత మట్టి రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కార్పొరేషన్‌కు ఆనుకొని ఉన్న మా కాలనీపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, సాయికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులు కృష్ణమోహన్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేశ్, ప్రదీప్‌కుమార్ సాయిజ్యోతి, చంద్రశేఖర్ లస్కర్‌నాయక్, రాజేందర్, కిరణ్, సాయిలాల్, విజయ్, సైదారావు, సాయికృష్ణవేణు, నర్సింగరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోటుబుక్స్ పంపిణీ చేస్తున్న నాయకులు

మీర్‌పేట: మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను కార్పొరేషన్ బీఆర్ఎస్ నేతలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మీర్‌పేట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, డిక్షనరీలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం కామేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ ముఖ్య పాత్ర పోషించారని, రాష్ట్రానికి ఎన్నో ఐటీ కంపెనీలు తెచ్చిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్, సునీత, విజయలక్ష్మీ, సిద్దాల బీరప్ప, దీప్‌లాల్‌చౌహాన్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో గురువారం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. చల్లగా చూడు తల్లీ అంటూ అమ్మవార్లను వేడుకొన్నారు. మాజీ కార్పొరేటర్లు, మాజీ ఎంసీటీసీలు, గ్రామపెద్దలు బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.



బోనంతో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



కమలానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో ఆయన పర్యటించి వరదనీటి కాలువ, భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిన సందర్భంగా జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వాహిని, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, నాయకులు సత్యనారాయణ, కాలనీ అధ్యక్షుడు టీ.వీ.రావు, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

చెట్లు, స్తంభాల వద్ద ఉండొద్దు

హస్తినాపురం: భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలకు వెళ్లే చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, కాలనీలలో వరదనీరు ప్రవహించే నాలాలు మ్యాన్‌హోళ్లు ఉన్న ప్రాంతాల సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడే ప్రమాదం ఉందని వర్షం పడుతున్నప్పుడు ఎవరూ కూడా చెట్ల కింద, విద్యుత్ స్తంభాలను ఆనుకుని ఉండరాదన్నారు. ఇప్పటికే హైడ్రా, జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, వాటర్‌వర్క్స్, బృందాల సహాయంతో బాధిత ప్రాంతాలలో సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు.

తొలి శ్రావణ శుక్రవారానికి ఏర్పాట్లు పూర్తి



వాసవి కాలనీలోని అష్టలక్ష్మి అమ్మవారు

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌జోన్ పరిధిలో అన్ని ఆలయాల్లో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. జోన్ పరిధిలోని ఆర్‌కేపురం వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయం, శ్రీదుర్గాదేవి దేవాలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, అక్బర్‌బాగ్‌లోని హరిహరక్షేత్రం, సైదాబాద్‌లోని శ్రీజయదుర్గా, శ్రీవిజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, మాదన్నపేట్‌లోని దుర్గాదేవి ఆలయం, ఐఎస్‌సదన్ పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం యూఎస్‌పీసీ నాయకులు ఆర్‌ఐ రోజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాశాఖకు సంబంధించి అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతులను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీఓ నంబర్ 25ను సవరించి ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా 40 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ విదానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు వెంకటయ్య, నర్సింలుగౌడ్, శంకర్, కృష్ణయ్య, రవీంద్రనాథ్, సత్యం, చంద్రశేఖర్, శివరాములు, చంద్రశేఖర్, తిరుమలయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

కేశంపేట: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులు తహసీల్దార్ అజాం అలీకి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ, పాల్గొన్నారు.

వార్డెన్‌లు అందుబాటులో ఉండాలి

మున్సిపల్ కమిషనర్ వెంకటేశం



బాలికల వసతి గృహంలో విద్యార్థినితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశం

చేవెళ్ల: వసతి గృహాల్లో రాత్రిళ్లు వార్డెన్లు అందుబాటులో లేకపోతే విద్యార్థుల పరిస్థితి ఎవరు తెలుసుకోవాలని, ఇది సరైన పద్ధతి కాదని మున్సిపల్ కమిషనర్ వెంకటేశం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న నాలుగు వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ నాలుగింటిలో ఒక ఎస్సీ బాలుర వసతిగృహంలో మినహా చేవెళ్లలోని ఎస్సీ బాలికల, బీసీ బాలుర, మోడల్ కళాశాల వసతి గృహాల్లో వార్డెన్‌లు అందుబాటులో లేకపోవటంపై ఆయన మండిపడ్డారు. తల్లిదండ్రులను వదిలి చదువుకోసం వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు అన్ని తానై వార్డెన్‌లే చూసుకోవాల్సి ఉంటుందని, అలాంటి వార్డెన్‌లే అందుబాటులో లేకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహాలను మరోసారి ఆకస్మికంగా తనిఖీ చేస్తానని.. ఏ వార్డెన్ అందుబాటులో లేరని తెలిసినా వారిపై చర్యలకు సిఫారసు చేస్తానని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా వసతి గృహాల్లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని గదులు, పరిసరాలను పరిశీలించారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో వార్డెన్, సిబ్బంది ఎవరు లేకపోవటంపై ఆయన ఆశ్చర్యపోయారు. చిన్నారులకు ఏమైనా అనారోగ్య సమస్య వస్తే రాత్రిళ్లు ఎవరు చూసుకుంటారని సిబ్బంది, మ్యాట్రిన్ తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించటంతో పాటు వారికి ఎలాంటి సమస్యలు లేకుండా వార్డెన్‌లు అందుబాటులో ఉండి చూసుకోవాలని తెలిపారు. వాటిల్లో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావటంతో వాటిని సంబంధిత శాఖతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు.